www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 5 పశ్చిమ గోదావరి

డిఇఒగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆర్.వెంకటరమణ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. వెంకటరమణ ఇప్పటివరకు ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖాధికారిగా పని చేశారు. రెగ్యులర్ విద్యాశాఖాధికారిగా నియమితులైన ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మరింత కష్టపడి పనిచేసి విద్యాశాఖలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానం నిలిపేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. డివిజనల్ విద్యా విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సిబ్బంది డిఇఒ ఆర్.వెంకటరమణకు అభినందనలు తెలిపారు.

ఆశాలపై అరాచకం

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న ఆశాలు, సిఐటియు

విజయవాడ మహాధర్నాకు వెళ్లవ్వకుండా నిర్బంధం

అరెస్టు చేసి అర్ధరాత్రి వరకూ పోలీసుల అదుపులోనే ఆశాలు

జిల్లా వ్యాప్తంగా 200 మంది అరెస్ట్

జిల్లా వ్యాప్తంగా పెల్లుబికిన నిరసన

అక్రమ అరెస్టులు, నిర్బంధాన్ని సిఐటియు ఖండన

ఏదైనా కారణం చేత మహిళలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొస్తే సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత సంబంధిత మహిళలకు సంబంధించిన కుటుంబ సభ్యుల్లో మహిళలు గానీ మహిళ పోలీసుల పర్యవేక్షణలో గానీ వారిని పోలీస్‌స్టేషన్లో ఉంచాలన్నది చట్టం చెబుతోంది. కానీ జిల్లాలో పోలీస్ శాఖ చట్టం ఆదేశాలను తుంగలోకితొక్కి ఆశా కార్యకర్తలపై అరాచకానికి పాల్పడింది. ఆశా కార్యకర్తలపై తీవ్ర నిర్బంధాన్ని విధించి అక్రమంగా అరెస్టు చేసి రాత్రంతా పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఈ నేపథ్యంలో అక్రమంగా అరెస్టు చేసిన ఆశా కార్యకర్తలను విడుదల చేయాలని, ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. ఆశా కార్యకర్తలపై విధించిన నిర్బంధాన్ని, అక్రమ

ప్రజాశక్తి - భీమవరం

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు తదితర డిమాండ్లు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు చలో విజయవాడ ధర్నాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పోలీసులను ఉపయోగించి ఆశాలపై తీవ్ర నిర్బంధాన్ని విధించింది. బుధ, గురువారాల్లో ఆశాల కోసం పోలీసులు జల్లెడ పట్టారు. ముందస్తు నోటీసులు జారీచేసి విజయవాడ వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. అయితే ఈ నిర్బంధాన్ని ఎదుర్కొని విజయవాడ వెళ్లే ఆశాలపై పోలీసులు కర్కశంగా వ్యవహరించారు. జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టుల వద్ద వారి కోసం జల్లెడ పట్టి అక్రమ అరెస్టులు చేసి నిర్బంధాన్ని విధించి వివిధ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం, పోడూరు పాలకోడేరు, తణుకు, ఆచంట, కాళ్ల, ఆకివీడు, వంటి ప్రధాన ప్రాంతాల్లో సుమారు 200 మందిని అక్రమంగా అరెస్టు చేశారు. మగ, పోలీసులు ఆశాల పట్ల దురుసుగా వ్యవహరించడమే కాకుండా దుర్భాషలాడారు. ఆశాల వద్ద సెల్ ఫోన్లు లాక్కుని చేతులు పట్టుకుని మరీ అరెస్టు చేశారు. భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో భీమవరం పట్టణం, భీమవరం రూరల్, వీరవాసరం, ఉండి, కాళ్ల, మొగల్తూరు మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలను అరెస్టులు చేసి నిర్బంధించారు. అలాగే మిగిలిన ప్రాంతాల్లో కార్యకర్తలను వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించి రాత్రంతా నిర్బంధించారు. భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 20 మంది ఆశాలను, పాలకోడేరులో మరో ఇద్దరిని రాత్రి రెండు గంటల వరకూ నిర్బంధించి అక్కడి నుంచి హన్సిక కళ్యాణ మండపానికి తరలించారు. పాలకొల్లు పోలీస్ స్టేషన్లో మరికొంతమంది ఆశాలను 12 గంటల వరకూ ఉంచారు. జిల్లా నలుమూలల నుంచి బయలుదేరిన మరో 200 మందిని వివిధ ప్రాంతాల్లో పోలీసులు నిర్బంధించి అరెస్టులకు పాల్పడ్డారు. అయితే ఈ నిర్బంధాన్ని సైతం ఎదుర్కొని సుమారు 200 మంది ఆశాలు విజయవాడ మహా ధర్నాకు బయలుదేరి వెళ్లారు. అరెస్టు చేసిన, నిర్బంధించిన వారిని తక్షణం విడుదల చేయాలని పోలీస్‌స్టేషన్ల వద్ద నిరసనలు తెలిపారు. వివిధ పోలీస్ స్టేషన్ల వద్ద సిఐటియు నేతలు, ఆశా కార్యకర్తలు ధర్నాలు చేశారు. అక్రమ నిర్బంధం, అరెస్టులను సిఐటియు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా ఖండించాయి.

భీమవరం పోలీస్ స్టేషన్‌లో అర్ధరాత్రి వరకూ ఆశా కార్యకర్తలను ఉంచిన పోలీసులు

భీమవరంలో హోరెత్తిన ఆశాల నిరసన..

ఆశాల పట్ల ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరుకు నిరసిస్తూ భీమవరంలో నిరసనలు హోరెత్తాయి. స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకూ నిరసన ప్రదర్శన చేసి రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. అరెస్టులు చేయడమే కాకుండా దుర్భాషలాడటం, చేతుల్లో ఉన్న సెల్‌ఫోన్లు లాక్కోవడం, మగ పోలీసులే స్టేషన్లకు తీసుకెళ్లడం పట్ల ఆశాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేసి పోలీసుల వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, డి.కళ్యాణి మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం గురించి గొప్పగా మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం చేయకుండా కాలయాపన చేసి, నిర్బంధించి ఉద్యమాలను ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి హాజరైన ఆశా వర్కర్లతోపాటు సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, త్రిమూర్తులు, దీపిక, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బిజెపికి వైసిపి, టిడిపి దాసోహం..!

- ❑ అరకొర డిఎస్‌సితో నిరుద్యోగులకు అన్యాయం
- ❑ ప్రత్యేక హోదాపై రెండు పార్టీలు ప్రజలకు మోసం
- ❑ దెందులూరులో బస్సుయాత్రలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

టిడిపి అధినేత చంద్రబాబు బిజెపి పెద్దల వద్దకెళ్లి కాళ్లు మొక్కారని, రేపు జగన్ కూడా బిజెపి పెద్దల వద్దకెళ్లడానికి సిద్ధమవుతున్నారని, రెండు పార్టీలూ రాష్ట్రానికి అన్యాయం చేసి బిజెపి దాసోహం అంటున్నాయనంటూ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. బిజెపి ఒక్క సీటు కూడా గెలవకుండా రెండు పార్టీలనూ తమ గుప్పెట్లో పెట్టుకుందన్నారు. దెందులూరు నియోజకవర్గంలో గురువారం కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల బస్సు యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర జాతీయ రహదారి నుంచి దోసపాడు మీదుగా పోతునూరు వరకూ కొనసాగింది. ముందుగా దెందులూరు నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారికి షర్మిల చేరుకోగానే దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి డివిఆర్‌కె చౌదరి, జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు, జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగత పలికారు. రోడ్డు పొడవునా పూలుజల్లుతూ జనం నుంచి మంచి స్పందన రావడంతో కాంగ్రెస్ నాయకుల్లో జోష్ నెలకొంది. ఈ సందర్భంగా షర్మిలా మాట్లాడుతూ రాష్ట్రానికి బిజెపి ఏంచేసిందంటూ ప్రశ్నించారు. వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాలను అమలు చేయలేని దిక్కు మాలిన ప్రభుత్వంగా వైసిపి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం విషయంలో వైసిపి, టిడిపిలు రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసం చేశాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదాపై మొదటి సంతకం చేస్తానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై ప్రధాన దృష్టిపెడతామని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రంలో మెగా డిఎస్‌సి నిర్వహిస్తామని జగన్ ప్రకటించారని, ఐదేళ్లు నోరుమెదపని జగన్ ఎన్నికల వేళ ఆరు వేల పోస్టులతో ప్రకటన ఇచ్చి తుస్సు మనిపించారన్నారు. ఇదో ఎన్నికల డ్రామా అన్నారు.

పోలవరం పూర్తి చేయలేదు..

పోలవరం ప్రాజెక్ట్‌పై టిడిపి ఎంతో హడావుడీ చేసిందని, తర్వాత జగన్ 2021 నాటికి పూర్తి చేస్తానని డాంబికాలు పలికారన్నారు. 2021 నాటికి ప్రాజెక్ట్ వ్యయం రూ.55 వేల కోట్లకు పెరిగిందని లెక్కలు కట్టారన్నారు. జగన్ ఐదేళ్ల కాలంలో రూ.ఎనిమిది లక్షల కోట్లు అప్పుచేశారని, అందులో నుంచి కనీసం రూ.50 వేల కోట్లు పోలవరం కోసం వెచ్చించలేక పోయారని విమర్శించారు. ప్రత్యేక హోదా వల్ల ఉద్యోగాలు, పరిశ్రమలు వస్తాయని చెప్పి గాలికి వదిలేశారన్నారు. తనకున్న 21 మంది ఎంఎల్‌ఎలతో రాజీనామా చేయిస్తానని ప్రగల్భాలు పలికాడని చెప్పారు. అధికారంలోకి వచ్చాక దాని ఊసే ఎత్తడం లేదన్నారు. 30 వేల మంది స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు తమ ఉద్యోగాలు పోతాయని ఎందుకు ఆందోళన చేస్తున్నారో తెలపాలన్నారు. రాష్ట్రంలో అసలు రాజధాని ఉందా అని ప్రశ్నించారు. 70 రోజులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విశ్రమించవద్దని, ప్రతి ఓటరునూ కలిసి ప్రభుత్వ, ప్రతిపక్షాల వైఫల్యాలను వివరిద్దామన్నారు. కాంగ్రెస్ వస్తే ఏం జరుగుతుందో వివరించి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరేద్దామన్నారు. మాజీ కేంద్ర మంత్రులు, సిడబ్ల్యూసి సభ్యులు జెడి శీలం, గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, దంపుబోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షురాలు షర్మిల

ప్రకాశం చౌక్ సెంటర్లో ఆందోళన చేస్తున్న వామపక్ష నేతలు

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

ప్రకాశంచౌక్ సెంటర్లో వామపక్షాల ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రాల హక్కులను బిజెపి ప్రభుత్వం హరిస్తోందని, రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్లో వామపక్షాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ రాష్ట్రాల హక్కులను బిజెపి హరించడంతో స్వతహాగా ఏంచేయలేని దుస్థితికి తీసుకురావడం అన్యాయమన్నారు. ప్రధానంగా ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల పట్ల దారుణమైన వివక్ష చూపుతోందన్నారు. పన్నులను కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి తెచ్చుకుని ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్కెన కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాలకు పన్నుల నుంచి రావాల్సిన వాటా ఇవ్వకుండా మొండిచేయి చూపుతోందన్నారు. ఈ విధానాలను ప్రజంతా ఖండించాలన్నారు. కేరళలో వామపక్ష ప్రజాతంత్ర పార్టీ ఎల్‌డిఎఫ్ దేశంలోనే ఆదర్శవంతమైన పాలన చేస్తోందన్నారు. కానీ ఆ రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన రూ. 20 వేల కోట్ల బకాయిల నిధులు ఇవ్వడంలేదన్నారు. ఢిల్లీలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, తమ మంత్రివర్గం, ఎంఎల్‌ఏలు ధర్నా చేస్తున్నారన్నారు. ఒక పక్క తెలంగాణ కూడా నిధులు రావడంలేదని ఆందోళనలు వ్యక్తం చేస్తోందన్నారు. ఇవన్నీ చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఎంత వివక్షపూరితంగా పాలిస్తోందో అర్థమౌతోందన్నారు. సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనాల భీమారావు మట్లాడుతూ ప్రజలచే ఎన్నికైన ప్రభుత్వాల హక్కులను హరిస్తూ తీవ్రమైన ఆటంకాలను కల్గిస్తున్నారన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసు దేవ రావు, కార్యకర్తలు మల్లిపూడి ఆంజనేయులు, చెల్ల బోయిన వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, సిపిఐ ఏరియా కార్యదర్శి మల్లుల సీతారంప్రసాద్ పాల్గొన్నారు.

అరెస్టులు.. ఆందోళనలు

- ❑ విజయవాడలో మహాధర్నాకు వెళ్లకుండా ఆశాల నిర్బంధం
- ❑ ప్రభుత్వ తీరును నిరసిస్తూ పోలీస్ స్టేషన్ల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి - ఆకివీడు

విజయవాడ మహాధర్నాకు ఆశావర్కర్లు, సిఐటియు నాయకులు హాజరు కావొద్దంటూ పోలీసులు వారికి బుధవారం రాత్రి గురువారం ఉదయం నోటీసులు అందించారు. జిల్లా శ్రామిక మహిళ విభాగం కార్యదర్శి డి.కల్యాణి, సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటనాయుడులకు ఈ నోటీసులు ఇచ్చారు. మొత్తం 63 మందికి నోటీసులు ఇచ్చారు. గురువారం ఉదయం విజయవాడ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన కొంతమంది ఆశాలను పోలీసులు రైలు నుంచి దించేసినట్లు సమాచారం.

తణుకు : నోటీసులిస్తున్న పోలీసులు

నరసాపురం : ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్లకు తరలించారు. 30 మంది ఆశా కార్యకర్తలను రూరల్ సిఐ నేతృత్వంలో అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న ఆశాలను అరెస్ట్ చేయడం దారుణమని సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము అన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు.

పాలకొల్లు : విజయవాడ బయలుదేరిన 53 మంది ఆశాలను పోలీసులు అదుపులోకి తీసుకుని పాలకొల్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, ఆచంట మండలాలకు చెందిన ఆశాలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. వీరితో పాటు సిఐటియు నేతలు జవ్వాది శ్రీనివాస్, దేవ సుధాకర్ ఉన్నారు. వీరందరిని గురువారం మధ్యాహ్నం విడిచిపెట్టారు.

నరసాపురం సిఐ కార్యాలయంలో ఆశాలు

పాలకొల్లు : పోలీస్‌స్టేషన్‌లో ఆశాలు

తణుకులో ధర్నా

తణుకు రూరల్ : ఆశావర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ వెళ్లడం నేరమా అని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రశ్నించారు. విజయవాడ మహాధర్నాకు వెళు న్న ఆశాలను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టులు చేసి తణుకు టౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఆశాల పట్ల ప్రభుత్వ తీరును నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నరేంద్ర సెంటర్‌లో రాస్తారోకో, పోలీస్ స్టేషన్ల వద్ద నిరసన, ధర్నాలు నిర్వహించారు. అక్రమంగా అరెస్టు చేసిన ఆశాలను విడుదల చేయాలని, వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అడ్డగర్ల అజయకుమారి, పి.దక్షిణామూర్తి, మండలాధ్యక్షులు ఎన్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపీ, గార రంగారావు, కొమర రాణి, ఎన్.అనంతలక్ష్మి, వై.మందులయ్య, కొత్తపల్లి అయ్యప్ప, రమణ, పి.సూర్యారావు, ఎ.రమేష్ పాల్గొన్నారు.

కాళ్ల : కాళ్ల పోలీస్ స్టేషన్ వద్ద ఆశావర్కర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండలాధ్యక్ష కార్యదర్శులు గొర్ల రామకృష్ణ, మండా సూరిబాబు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం కోసం విజయవాడ వెళ్తున్న ఆశావర్కర్లను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం అవమానిక చర్య అన్నారు. కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆశావర్కర్లను పరామర్శించారు. చిట్టూరి విజయ భారతి, ఆవాల దేవి, పడగల దుర్గాభవాని, ఎం.నాగలక్ష్మి, దుర్గాభవాని, కృష్ణవేణి, పెద్దిబోయిన పరస వేణి, ఉడుము వరలక్ష్మి, తలారి పుష్పకాంతం, రెడ్డి నాగలక్ష్మి అరెస్టు అయ్యారు.

నరసాపురం : రూరల్ సిఐ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లకు మద్దతుగా టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, పార్టీ నాయకులు కొవ్వలి రామ్మోహన్ నాయుడు ధర్నా చేశారు. ఈ ధర్నాలో టిడిపి నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, బర్రె మురళి పాల్గొన్నారు.

ఆచంట : ఆశావర్కర్లను పాలకొల్లు రైల్వే స్టేషన్ వద్ద అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని ఆశా వర్కర్ల మండల కార్యదర్శి నక్క శైలజ అన్నారు. పాలకొల్లు రైల్వే స్టేషన్ నుంచి ఆచంట మండలానికి చెందిన పదిమంది ఆశా వర్కర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బంధించి మూడు గంటల తర్వాత విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. అరెస్ట్ అయిన వారిలో నక్క శైలజ, జి.గంగాభవాని, బి.మీనాకుమారి, బి.లక్ష్మీకుమారి, కె.విజయలక్ష్మి, ఎ.అనితకుమారి, కె.సుజ్ఞానకుమారి, వి.ధనలక్ష్మి, యు.రూతు, జి.అన్నపూర్ణ ఉన్నారు.

భీమవరం రూరల్ : ఆశా వర్కర్లను అరెస్టులు చేయడమే కాకుండా దుర్భాషలాడటం, చేతుల్లో ఉన్న సెల్‌ఫోన్లు లాక్కోవడం, మగ పోలీసులే స్టేషన్లకు తీసుకెళ్లడంపై ఆశావర్కర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరంలో ఆశావర్కర్లు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేసి పోలీసుల వైఖరిని ఎండగట్టారు. శాంతియుతంగా ఆందోళన చేపట్టిన తమను పోలీసులు విచక్షణారహితంగా అరెస్టులు చేసి దుర్భాషలాడటం దారుణమన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి వన్ టౌన్ స్టేషన్ మీదుగా టూ టౌన్ స్టేషన్‌కి చేరుకుని అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, డి.కల్యాణి మాట్లాడారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, త్రిమూర్తులు, దీపిక, విజయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పోడూరు : అక్రమంగా అరెస్టు చేసిన ఆశాలను విడుదల చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో పోడూరు పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల జిల్లా నాయకురాలు టి.అమ్మాజీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్, మండలాధ్యక్షులు పిల్లి సాయిలక్ష్మి, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి బొంతు శ్రీను, పల్లి శ్రీదేవి పాల్గొన్నారు.

ఉండి : అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఉండి మండలానికి చెందిన ఆశావర్కర్లు అన్నారు. విజయవాడ వెళ్తున్న ఆశాలను పోలీసులు అడ్డుకుని అక్రమ అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం దారుణమని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

తాడేపల్లిగూడెం : ఆశా కార్యకర్తల అక్రమ అరెస్టు అప్రజాస్వామికమని సిఐటియు పట్టణ నాయకులు కర్రి నాగేశ్వరరావు అన్నారు. ఆశావర్కర్లు విజయవాడలో మహాధర్నాకు తరలి వెళ్తున్న అత్తిలి, తణుకు, పెంటపాడు, తాడేపల్లిగూడెంలకు చెందిన 40 మంది ఆశావర్కర్లను బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌లో నిర్బంధించడాన్ని సిఐటియు నాయకులు కర్రి నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు.

గణపవరం : ఆశావర్కర్ల అక్రమ అరెస్టును వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ఖండించారు. పిప్పర కళ్యాణమండపంలో ఆశాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపాలేరన్నారు.

భీమవరంలో ధర్నా

పెంటపాడు : పెంటపాడు పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రంగారావు, సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, ఆశా నాయకురాలు వైజయంతి మాట్లాడారు. అరెస్ట్ చేసిన ఆశావర్కర్లను, నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగమణి, అచ్యుతాంబ, వరలక్ష్మి, మల్లేశ్వరి, ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

మళ్లీ కొట్టుకుపోయిన పొన్నపల్లి ఏటిగట్టు

విపక్షాల నుంచి వెల్లువెత్తుతున్న విమర్శలు

పనులు నాణ్యతగా చేయాలని కోరుతున్న ప్రజలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని వశిష్ట గోదావరి పొన్నపల్లి ప్రాంతాల్లో రూ.26 కోట్లతో నిర్మిస్తున్న ఏటిగట్టు మరోసారి కొంత మేర కూలిపోయింది. బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కూలిపోయింది. ప్రస్తుతం వరద లేకున్నా ఈ సంవత్సరం పనులు పూర్తవ్వకుండానే రెండో కూలిపోవడంతో పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.26 కోట్లతో నిర్మిస్తున్న ఏటిగట్టు పనుల డొల్లతనం బయట పడటంతో విపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనవరి 12వ తేదీన ఏటిగట్టు 50 మీటర్లు ఒక్కసారిగా కూలిపోయింది. 2022 జూన్‌లో వరద వచ్చినప్పుడు అమరేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి బుడిదల రేవు వరకూ ఏటిగట్టు కోతకు గురైంది. అప్పట్లో రూ.50 లక్షలతో తాత్కాలికంగా పనులు చేపట్టారు. 2022 నవంబర్‌లో సిఎం జగన్ చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. 2023లో పనులు ప్రారభించారు. ఇక్కడ పనుల్లో చేపట్టిన రాళ్లు నాణ్యత లేవని, నాసిరకమైనవని టిడిపి మాజీ ఎంఎల్‌ఎ మాధవ నాయుడు అప్పట్లో మండల స్థాయి నుంచి గవర్నర్ వరకు అందరికి ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. అప్పట్లో అధికారులంతా నాణమైనవని చెప్పారు. ఆ తర్వాత ఏటిగట్టు కొట్టుకుపోవడంతో మాజీ ఎంఎల్‌ఎ మాధవనాయుడు, సిపిఎం నాయకులు ముచ్చర్ల త్రిమూర్తులు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, టిడిపి నాయకుడు కొవ్వలి రామ్మోహన్‌నాయుడు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయాలు మాని పనులు నాణ్యతగా చేపట్టాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నరసాపురం ఆర్‌డిఒ ఎం.ఎ.అంబరీష్ అధికారులతో కలిసి పరిశీలించారు. తగిన చర్యలు చేపట్టాలని అధికారులను అప్రమత్తం చేశారు. స్థానిక పోలీసులు అటువైపు ప్రజలు ఎవరు రాకుండా బారిగేట్లు ఏర్పాటు చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, టిడిపి సీనియర్ నాయకులు కొవ్వలి రామ్మోహన్‌నాయుడు కూలిన ఏటిగట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

కొట్టుకుపోయిన ఏటిగట్టు

ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇంగ్లీష్ భాషపై పట్టు సాధిస్తే అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని అంతర్జాతీయ కార్పొరేట్ ట్రైనర్ జార్జ్ జాన్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇంగ్లిష్, ఫారిన్ లాంగ్వేజెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఐఇఎల్‌టిఎస్ (ఇంటర్నేషనల్ ఇన్ ఇంగ్లీష్ లెర్నింగ్ టెస్టింగ్ సిస్టం)పై ఇంజినీరింగ్ మూడో సంవత్సరం, ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జ్ జాన్ విద్యార్థులకు ఇంగ్లీష్ భాష అధ్యయనంలో మెలకువలు నేర్పారు. గ్లోబల్‌గా ఉన్నటువంటి అవకాశాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు ఇటువంటి ఓరియంటేషన్ తరగతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు ఇంగ్లిష్, ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎస్.లక్ష్మి చెప్పారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి - నరసాపురం

క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని నరసాపురం పట్టణ సిఐ కెవి.స్వామి అన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి పట్టణ సిఐ కెవి.స్వామి, ఎస్ఐ బివిఎస్.ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి గాలిలోకి బెలూన్లు వదిలారు. అనంతరం సరదాగా పిల్లలతో కలిసి ఆటలు ఆడారు. ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు.

నేడు మెగా ఆక్వా మేళా

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో శుక్రవారం నిర్వహించే మెగా ఆక్వా మేళా కార్యక్రమానికి రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి అప్పలరాజు విచ్చేయనున్నారు. ఆక్వా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నరసాపురం అల్లూరి కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగే రొయ్యల, చేపల రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమానికి అప్పలరాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చీఫ్ విప్ కార్యాలయం నుంచి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా సుభాష్‌చంద్రత్రినాధ్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని వాలమర్రు గ్రామం సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా పి.సుభాష్‌చంద్రత్రినాధ్‌రాజు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ హాజరై మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని, రైతులకు నాణ్యమైన సేవలందించాలని చైర్మన్ త్రినాధ రాజుకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, మండల కన్వీనర్ విపర్తి ప్రభాకర్, సర్పంచి గంట సత్యనారాయణ, ఎఎంసి మాజీ ఛైర్మన్ సాల నరసయ్య, చంటిరాజు, సొసైటీ మాజీ ఛైర్మన్ వేంద్ర సింహాచలం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సొసైటీ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన త్రినాథ్

న్యాయం జరిగే వరకూ పోరాటం

ప్రజాశక్తి - పాలకోడేరు

గొరగనమూడి జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు న్యాయ పోరాటం సాగిస్తానని ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ తెలిపారు. గొరగనమూడి అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో జగనన్న కాలనీ లబ్ధిదారులతో బాలకృష్ణ గురువారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన జగనన్న ఇళ్ల స్థలాల లే అవుట్‌లో గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సెంటున్నర చొప్పున స్థలాలు కేటాయించి పట్టాలు ఇచ్చింది కానీ భూమిని అప్పగించకపోవడం దారుణమన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. లబ్ధిదారులకు భూములు అప్పగించే వరకు లబ్ధిదారులతో కలిసి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో లబ్ధిదారులు గోడి రమేష్, తులసి, చంద్రమోహన్, ప్రసాద్, శ్యామ్ పాల్గొన్నారు.

రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం

వివిధ పంటల సాగులో నష్టపోతున్న రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి శివన్నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవి.ఆనంద్, రైతు నాయకులు నామన వెంకటేశ్వరరావు, ఎం.లక్ష్మీపతి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తిరుమాని కామేశ్వరరావు, సనపల శ్రీనివాసరావు, కోన గొల్లయ్య పాల్గొన్నారు.

'అన్నివిధాలా నియోజకవర్గ అభివృద్ధి

ప్రజాశక్తి - పాలకొల్లు

తాను పాలకొల్లు నుంచి గెలిస్తే నియోజకవర్గాన్ని రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ప్రథమ స్థానంలో ఉంచుతానని వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపీ చెప్పారు. వైసిపి కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఆయన ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివద్ధి చేస్తానని చెప్పారు.

రామలింగేశ్వర హుండీ ఆదాయం రూ.1.66 లక్షలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని రాయలం గ్రామంలో ఉన్న బాల త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.1.66 లక్షలు వచ్చిందని ఆలయ ఛైర్మన్ చినిమిల్లి వెంకటరామయ్య (బాబి) తెలిపారు. ఆలయ ఇఒ రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో గురువారం హుండీ లెక్కింపు ధర్మకర్తలు ఆలయ సిబ్బంది హుండీ తెరిచి లెక్కించారు. 17 నెలలకు రూ.1,66,200 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చినిమిల్లి నాగన్న, ధర్మకర్తలు పస్తుల రాంబాబు, చేకూరి రామకృష్ణంరాజు, చెప్పాడా రజిని, బండి రమణ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నేరాలు - ఘోరాలు

తూర్పుపాలెంలో చోరీ

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని తూర్పు పాలెంలో ఒక ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుపాలెంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు క్యాంపు కార్యాలయం సమీపంలో వేమవరపు నాగమణి తన ఇద్దరు కుమారులతో అద్దెకు ఉంటుంది. కొన్నాళ్ల క్రితం స్థలం కొనుక్కొని ఇల్లు నిర్మించుకుంటున్నారు. తూర్పుపాలెంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పది రోజులుగా డ్వాక్రా మహిళలకు మనసారా ఆసరా సంబరాలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నాగమణి కూడా ఇక్కడ రోజువారి పనికి వెళ్లేది. ఎప్పటిలాగే బుధవారం రాత్రి పది గంటల వరకు పని చేసుకుని క్యాంపు కార్యాలయంలోనే విశ్రాంతి తీసుకుంది. పెద్ద కుమారుడు పెనుగొండలోని బంధువుల ఇంటి వద్ద ఉన్నాడు. చిన్నకుమారుడు తన తండ్రి ఉండ్రాజవరపు పెద్దిరాజు ఇంటి వద్ద ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున సమయంలో కూరగాయలు కోయడానికి అందరినీ లేపగా నాగమణి దగ్గరలో ఉన్న తన ఇంటికి వచ్చి ఇంటి తలుపులు తీయగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా, బీరువా తాళాలు పగిలి ఉండడంతో దొంగలు పడ్డారని గుర్తించింది. ఇంటి పనుల నిమిత్తం దాచుకున్న రూ.75 వేల నగదు, అరకాసు బంగారం చోరీకి గురైనట్లు గుర్తించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఎరువులు ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎరువులు, పురుగుమందులు ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని తణుకు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎవి.రమేష్ వ్యాపారులకు సూచించారు. మండలంలోని కృష్ణాయపాలెం, మెదుగుంట, నవాబ్‌పాలెం, ఆరుగొలను గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద శుక్రవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రైతులు పాల్గొనాలని కోరారు.

బెంగళూరుకు పాలకొల్లు విద్యార్థులు

పాలకొల్లు : స్థానిక శ్రీ దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థినులు 31 మంది బెంగళూర్ విర్ స్టన్ సెల్ ఫోన్ కంపెనీలోకూడా నెలల ఇంటర్న్‌షిప్ శిక్షణ నిమిత్తం గురువారం బయలుదేరి వెళ్లారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నూతన విద్యా విధానంలో భాగంగా శిక్షణ నిమిత్తం, తల్లిదండ్రుల అనుమతితో బయలుదేరి వెళ్తున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు.

'బడ్జెట్ అంకెల గారడీ'

ప్రజాశక్తి - నరసాపురం

బడ్జెట్ అంతా అంకెల గారడీ అని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు కొవ్వలి రామ్మోహన్‌నాయుడుతో కలిసి గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రామరాజు మాట్లాడారు. సిఎం జగన్ ఆంధ్రప్రదేశ్‌ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సిఎం కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు.

భీమవరం రూరల్ :వైసిపి ప్రభుత్వం ఆర్థిక మంత్రి బుగ్గనతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అని రాష్ట్ర ప్రజలకు అర్థమవుతుందని టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి తెలిపారు. రాష్ట్ర అప్పులు రూ.11.58 లక్షల కోట్లు ఉండగా ఇతర శాఖల రుణ భారాలను సామాన్య ప్రజలపై పన్నుల రూపంలో వేసి అత్యధిక పన్నులను వసూలు చేయడం జగన్ ప్రభుత్వానికే చెందిందని విమర్శించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

భీమవరం రూరల్ :మత్తు పదార్థాల బారిన పడి యువత వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని జమాతె ఇస్లామీ హింద్ పట్టణ ఉద్యమ కన్వీనర్ మొహమ్మద్ సిద్దీఖ్ అన్నారు. యువతకు అవగాహన కల్పించి మత్తు పదార్థాల నిర్మూలనతో ఉత్తమ సమాజాన్ని స్థాపించేందుకు జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి 18 వరకు రండి! మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం నినాదంతో రాష్ట్ర స్థాయి అవగాహనా ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలి పారు. స్థానిక అంకాల్ ఆర్ట్ అకాడమీలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే అనేక రకాల దుష్పరిణామాల గురించి విస్తృతంగా ప్రచారం, అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

పలుచోట్ల 'ప్రజల వద్దకు పితాని'

ఆచంట (పెనుమంట్ర) :డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసింది చంద్రబాబేనని, ఆయన వస్తే డ్వాక్రా మహిళలకు అన్యాయం జరుగుతుందని శ్రీరంగనాథరాజు చెప్పటం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లింద్రపర్రు, మల్లిపూడి గ్రామాల్లో ప్రజల వద్దకు పితాని పాదయాత్రను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

భీమవరం రూరల్ : మహాత్ముని ఆశయాలు నెరవేర్చడం మనందరి సామాజిక బాధ్యత అని పస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ కోడె వెంకట్రావు అన్నారు. జాతీ య కుష్టు వ్యాధి అవగాహన, ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక, సెయింట్ మేరీస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి విద్యార్థులతో ప్రతిజ్ఞ, ర్యాలీ, వకృత్వ పోటీలు నిర్వహించారు.

ఆదినారాయణ మృతి తీరని లోటు

సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - మొగల్తూరు

జద్ది ఆదినారాయణ మృతి సిపిఎం, పంచాయతీకి తీరని లోటని జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి పడమటిపాలెంలో ఆదినారాయణ ఇంటి వద్ద సిపిఎం మండల నాయకులు యద్ల చిట్టిబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఆదినారాయణ సుమారు 35 ఏళ్లుగా పార్టీకి ఎనలేని సేవలందించిన వ్యక్తి అన్నారు. మొగల్తూరు పంచాయతీ తొమ్మిదో వార్డు సభ్యునిగా గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించారన్నారు. పార్టీ ఉద్యమాల్లో, కార్మిక సంఘాల నాయకుడిగా కూడా పనిచేశారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో స్థానికుల సహకారంతో తొమ్మిదో వార్డు మెంబర్‌గా విజయం సాధించి అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. వారి కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. తొలుత ఆదినారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సాంబమూర్తి, కొత్తపల్లి నాగరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, జల్లి రామ్మోహన్, మువ్వల రాజారావు, కొల్లాటి బాబూరావు, చిలకలపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

దేశాభివృద్ధిలో పరిశోధనలే కీలకం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశాభివృద్ధిలో పరిశోధనలే కీలకమని, విభిన్న రంగాల్లో నూతన ఆవిష్కరణల రూపకల్పనకు అవి ఎంతగానో దోహదపడతాయని పాట్నాలోని ఐఐటి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ జగన్నాథ్ మాలిక్ తెలిపారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఇసిఇ, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఛాలెంజెస్, ఇన్నోవేషన్ ఇన్ యాంటీనాస్ ఫర్ వైర్‌లెస్ కనెక్టివిటీ అంశంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని ఆన్‌లైన్ నిర్వహించారు. ముఖ్య అతిథి జగన్నాథ్ మాలిక్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వైర్‌లెస్ కనెక్టివిటీ కోసం యాంటీన్నా, మైక్రోవేవ్స్‌లో జరుగుతున్న విస్తృత పరిశోధనలు, వాటి ప్రాధాన్యం, ఆయా సాంకేతిక వ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కార మార్గాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ ఎస్.యువరాజు, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ సుభాని, డాక్టర్ వి.సుదర్శన పాల్గొన్నారు.

నులి పురుగులను నివారించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు జివిఎన్‌ఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హెలినా తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ నులి పురుగుల బారిన పడిన విద్యార్థులు శారీరకంగా, మానసికంగా బలహీన పడతారని చెప్పారు. గోళ్లను చిన్నవిగా, శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకూడదని, ఎప్పుడూ మరుగుదొడ్లే ఉపయోగించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర పౌడర్ చేసి నీళ్లల్లో కరిగించి ఇవ్వాలని, మూడేళ్ల నుంచి 19 సంవత్సరాల విద్యార్థులకు టాబ్లెట్లు నమిలి మింగాలని సూచించారు. అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ పాల్గొన్నారు.

'సామూహిక ఎలుకల నిర్మూలన' జయప్రదం చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఈ నెల తొమ్మిదో తేదీ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు కోరారు. పాలకోడేరులో గురువారం ఆయన భీమవరం వ్యవసాయ సహాయకులు సిహెచ్.శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి వి.నారాయణరావులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మోగల్లులో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. అనంతరం వరి పొలాలను పరిశీలించి గట్లపై ఉన్న ఎలుకల కన్నాలను గుర్తించి రైతులకు అవగాహన కల్పించారు. వీరితో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు మురళీకృష్ణ, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

ఉండి :మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో గురువారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు ఎలుకలు నివసించే అన్ని బొరియలు గుర్తించి వాటిని మట్టితో పూడ్చి వాటిని గుర్తించేందుకు వీలుగా గుర్తులు పెట్టాలని ఆమె సూచించారు. రెండో రోజు శుక్రవారం ముందు రోజు పూడ్చిన బొరియలను గుర్తించి అవి తెరిచి ఉంటే వాటిలో ఎలుకలు ఉన్నాయని నిర్ధారించుకుని బ్రోమోడయోలిన్ మందును చిన్న చిన్న పొట్లాలుగా చేసి తెరిచిన బొరియల్లో ఉంచి మళ్లీ మట్టితో పూడ్చడం ద్వారా ఎలుకల ఉధృతిని నివారించవచ్చని చెప్పారు.

మొగల్తూరు : వరి పంటల్లో ఎలుకల నిర్మూలనకు అన్నదాతలు సామూహికంగా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఎఒ అబ్దుల్ రహీం సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎలుక బొరియలు గుర్తించి వాటిని రైతులతో కలిసి మూసివేశారు. శుక్రవారం ఎలుకల నిర్మూలన మందును అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద అన్నదాతలకు ఉచితంగా అందించనున్నారన్నారు. బొరియల వద్ద ఎలుకల నిర్మూలన మందును ఉంచాలని తెలిపారు.

శివరామరాజు వ్యాఖ్యలు అర్థరహితం

మంతెన రామరాజే ఎంఎల్ఎ అభ్యర్థి
టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరాజు

ప్రజాశక్తి - ఉండి

మాజీ ఎంఎల్ఎ శివరామరాజు వ్యాఖ్యలు అర్థరహితమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్ అన్నారు. ఉండి టిడిపి కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు అధ్యక్షతన గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పార్టీ పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు మండలాధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వర రాజు, గుండాబత్తుల నాగేశ్వరరావు, మోటుపల్లి రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు ఇటీవల కొన్ని ఛానల్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉండిలో టిడిపి నిలబెట్టింది తానేనని వ్యాఖ్యానించడం అర్థరహితమని, మాజీ మంత్రి కలిదిండి రామచంద్రరాజు ఐదు సార్లు ఎంఎల్ఎగా పార్టీ నుంచి గెలుపొంది పార్టీని నియోజకవర్గ కంచుకోటగా నిలబెట్టారన్నారు. ఆయన తర్వాత కష్టకాలంలో కూడా కార్యకర్తలు పార్టీని వీడకుండా అంకితభావంతో పనిచేయడం వల్ల పార్టీ బలోపేతమైందన్నారు. సిట్టింగ్ స్థానాన్ని తనకు కట్టబెట్టాలని, లేకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని శివరామరాజు చెప్పడం సరికాదన్నారు. శివరామరాజుకు ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కావాలనే కోరిక ఉంటే అధిష్టానం వద్ద తేల్చుకోవాలన్నారు. శివరామరాజు ఎంఎల్ఎగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు క్షత్రియ సామాజిక తరగతికి చెందిన వారిని నియమించారని, మరి అప్పుడు బిసిలు గుర్తుకు రాలేదా అని బిసి సెల్ నియోజకవర్గ కన్వీనర్ దొంగ కృష్ణ ప్రశ్నించారు. శివరామరాజు ఎంఎల్ఎగా ఉన్న సమయంలో కార్యకర్తలు, నాయకులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. నాయకులపై పోలీసు కేసులు నమోదయ్యేవన్నారు. మంతెన రామరాజు మాత్రమే ఎంఎల్ఎ అభ్యర్థి అని చెప్పారు. తమ అధిష్టానం ఎవరికి సీటు కేటాయిస్తే వారి విజయమే పరమావధిగా పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు భూపతిరాజు తిమ్మరాజు, చెన్నంశెట్టి హరినాయుడు, కట్టా రాంబాబు, బొల్లం వెంకటరావు, కిన్నెర వెంకన్న, మంతెన సాయిలచ్చిరాజు, కందుల రాధా బలరామకృష్ణ శ్రీనివాస్, పేరిచర్ల కృష్ణంరాజు పాల్గొన్నారు.

'తెలుగు యువత సమిష్టిగానే ఉంటుంది'

ఉండి : తెలుగు యువతను చిన్నాభిన్నం చేసే వ్యాఖ్యలు చేస్తూ మాజీ ఎంఎల్ఎ శివరామరాజు గ్రూపు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం తగదని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు అన్నారు. స్థానికంగా గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చెన్నంశెట్టి హరినా యుడు, తెలుగు యువత కాళ్ల మండలాధ్యక్షులు మంతెన రామరాజు మాట్లాడుతూ ఎంఎల్ఎ మంతెన రామరా జుకు తెలుగు యువత ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. శివరా మరాజు వ్యాఖ్యలు అర్థరహితమని, ఆయనపై అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు తెలుగు యువత సిద్ధంగా ఉందని తెలిపారు.

ముగిసిన మనసారా ఆసరా సంబరాలు

ప్రజాశక్తి - ఆచంట

వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద రంగనాథరాజు ఆధ్వర్యంలో జరుగుతున్న మనసారా ఆసరా సంబరాలు గురువారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు పది వేల మంది డ్వాక్రా మహిళలకు భోజనం పెట్టి చీరలు అందించారు. శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ డ్వాక్రా రుణాలను తిరిగి చెల్లించి మహిళలకు సిఎం జగన్ ఎంతో మేలు చేశారని తెలిపారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ పరిగణలోకి తీసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో చెరుకువాడ శ్రీ రంగనాథరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీ గజ మాలతో ఎంఎల్ఎను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్లు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సిఎం చేయాలి

ఆకివీడు : తాను ఎంఎల్ఎ అయినా కాకపోయినా ఇబ్బంది లేదని, జగన్ ముఖ్యమంత్రి కాకపోతే మాత్రం పేదలు తీవ్రంగా నష్టపోతారని వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. నాలుగో విడత ఆసరా పంపిణీ కార్యక్రమానికి స్థానిక ఐ భీమవరం రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని వైసిపి జిల్లా యువజన నాయకులు అంబటి రమేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడారు. మండలంలో 14058 మంది పొదుపు సంఘాల సభ్యులకు రూ.16,40,20,006 చెక్కులను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, గూడూరి ఉమాబాల అందించారు. అనంతరం డ్వాక్రా మహిళలు సిఎం జగన్ చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నరసాపురం పార్లమెంటరీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, వైసిపి నాయకులు, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ హైమావతి, జెడ్‌పిటిసి సభ్యులు ఎండగండి శ్రీను, ఎంపిపి కటారి జయలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ రసూల్ బిబి, స్వయం సహాయక సంఘాల జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పళ్లెం అరుణకుమారి, మెప్మా అధ్యక్షురాలు మొర జ్యోతి, వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ, ఝాన్సీ పాల్గొన్నారు.

నరసాపురం వైసిపి అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను ప్రకటించిన అనంతరం ఆమెను తొలిసారిగా ఈ వేదిక నుంచి పివిఎల్ ఓటర్లకు పరిచయం చేశారు. ఇక్కడ నుంచే ఆమె తొలి బహిరంగ ప్రసంగం మొదలైందని చెప్పొచ్చు. సభకు వచ్చినవారు భోజనాలు చేసేందుకు ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశారు. క్యూ విధానం పాటించకపోవడంతో తోపులాట జరిగింది. స్వయం సహాయక సంఘాల వారు నిర్వహిస్తున్న పలు రకాల వ్యాపారాల స్టాల్స్‌ను ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ అందరిని ఆకట్టుకున్నాయి.

ఓట్ ఫర్ ఓపిఎస్ పోస్ట్ కార్డ్

ప్రజాశక్తి - పోడూరు

యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదంతో ఈ నెల ఐదో తేదీ నుంచి జరుగుతున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా గురువారం పలు రాజకీయ పార్టీల అధినేతలకు పోస్ట్ కార్డ్ క్యాంపెయిన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దాసరి క్షేమమూర్తి, కేతా నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్ పాల్గొన్నారు.

హక్కులు హరిస్తున్న మోడీ

ప్రజాశక్తి - గణపవరం

ప్రధాని మోడీ రాష్ట్రాల హక్కులను హరిస్తున్నాడని సిపిఎం నాయకులు విమర్శించారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి గొంతు నొక్కుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కమిటీ కార్యదర్శి పి.నరసింహమూర్తి మాట్లాడుతూ రాష్ట్రాల హక్కులు హరిస్తున్న మోడీ, అమిత్ షాలకు జగన్ వంగి వంగి నమస్కరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజల పైన ప్రేమ ఉంటే కేరళ ప్రభుత్వం చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.పెంటారావు, కె.త్రినాథ్, పివిఆర్.సుబ్రహ్మణ్యం, కోన శ్రీను, ఎస్.సంజీవరావు, వి.వీరభద్రం పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, నడుపల్లె గ్రామం ఇంటి నెంబర్ 1-7/3 రు కాపురస్తులు కాట్రు రాములు గారి కుమారుడు కాట్రు బసవయ్య తెలియచేయునది ఏమనగా,

ది. 07-08-2018న నా స్వార్జిత సొమ్ముతో దుగ్గిరాల గ్రామము నందు ఆర్.యస్. నెంబర్ 340 రు దాఖలా 105 చదరపు గజములు కొనుగోలు చేసి ఏలూరు రిజిస్టర్ కార్యాలయం నందు దస్తావేజు నెంబర్ 9023/2018 రుగా రిజిస్టర్ కాబడినది. సదరు పైన ఉదహరించిన ఒరిజినల్ దస్తావేజును ఫొటోస్టాట్ కాపీలు నిమిత్తం ఏలూరు 1 టౌన్ ఏరియా రామకోటి సెంటర్ ఏరియా నందు నా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా పోగొట్టుకున్నాను. ఆ సమయంలో ఎంత వెతికినా దొరకపోవటం ఈ పేపర్ ప్రకటన వేయుచున్నాను. కావున సదరు ఒరిజినల్ దస్తావేజు 9023/2018 ఏలూరు (R.O), ఎవరికయినా దొరికినచో పై తెలిపిన అడ్రసుకు అందించగలరు.

సెల్: 7386677379

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో,కదిరి
H.M.O.P No. 145/2022

Between:
ఒడం కిరణ్మయి W/o అక్కిరెడ్డి దిలిప్, D.No:1-1135-250, అడపాల వీధి, కదిరి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...పిటీషనర్

మరియు

అక్కిరెడ్డి దిలిప్ S/o ఎ.శ్రీనివాసులు, D.No:15-123, అగ్రహారం వీధి, ఆకువీడు గ్రామము మరియు మండలం వెస్టు గోదావరి జిల్లా. ...రెస్పాండెంట్

ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలో పై కోర్టు వారు మీ హాజరు నిమత్తం 12/02/2024 తేదిన వాయిదా వేసినారు. కావున మీరు 12/02/2024 వ తేది ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని పరోక్షమున తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియజేయ డమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:12/02/2024
స్థలం:కదిరి

పి.వి.శివప్రసాద్, B.Com., B.L,

దస్తావేజులు పోయినవి

మా క్లయింటు అయిన ఏలూరు జిల్లా, కొయ్యలగూడెం మండలం, పొంగుటూరు గ్రామ కాపురస్తులు **వీరభద్రుడు గారి కుమారుడు పసుపులేటి రాంబాబు గారు** మాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

ది. 07-02-2024న మా క్లయింటు స్థిరాస్తి తాలూకు ఒరిజినల మరియు లింకు దస్తావేజులు తీసుకుని జిరాక్సు నిమిత్తం పొంగుటూరులో గల తన నివాసం నుండి కొయ్యలగూడెం సెంటర్‌కు వెళుతుండగా దారిలో **ది. 25-06-2015 సం॥రం తేదీన** పట్టపు శ్రీహరి అను వారి వద్ద నుండి నా క్లయింటు క్రయం పొంది అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిస్టర్ కాబడిన **దస్తావేజు నెం. 2189/2015** మరియు దాని తాలూకు **లింకు దస్తావేజులు 1174/2004, 1084/2007 మరియు 755/2011** లు పోయినవి. కావున సదరు పై దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల దయచేసి ఈ దిగువ అడ్రస్ నందు తెలియజేయవలసినదిగా కోరడమైనది.

వీర్ల సతీష్‌కుమార్, అడ్వకేట్
నిడదవోలు, తూ॥గో॥జిల్లా
సెల్: 99891 79905

SOUTH INDIAN Bank
జె.పి. రోడ్, భీమవరం బ్రాంచ్ 08816-231678

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది బంగారు ఆభరణములపై ఋణములు పొంది తిరిగి సకాలములో చెల్లించనందున ఈ క్రింది తెలియపరచిన బంగారు ఆభరణములను సౌత్ ఇండియన్ బ్యాంక్, భీమవరం బ్రాంచి నందు ది. 17-2-2024 శనివారం మధ్యాహ్నం 3 గం.లకు వేలం వేయుటకు నిర్ణయించడమైనది.

క్ర సం.	ఖాతా నెంబర్	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	బంగారం గ్రా॥లలో	బకాయి
1.	098965300 0002544	యిందుకూరి శివ కృష్ణంరాజు డోర్ నెం.1-45, శివాలయం వీధి, వసంతవాడ-533 235, తూ॥గో॥జిల్లా.	8.8	రూ.25,000/-

షరతులు - నిబంధనలు : 1) వేలం నందు పాల్గొనదలచినవారు రూ.3,000/- ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. అట్లు చెల్లించని ఎడల పాటదారులు తమ యొక్క ధరావత్తు సొమ్మును కోల్పోవుదురు. 3) నగల బరువునకు, నాణ్యతకు బ్యాంకువారి పూచీ ఏమాత్రం లేదు. 4) ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ, వేలం ఆపుటకు గానీ, రద్దు చేయుటకు గానీ, బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. 5) ఈ ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 6) అప్పు వసూలు నోటీసులు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటనను తుది నోటీసుగా భావించి వేలము తేదీలోగా సొమ్ము చెల్లించవచ్చును.

తేది : 8-2-2024 సం/- బ్రాంచ్ మేనేజర్, భీమవరం

TADEPALLIGUDEM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE

Roc. No. 2422/E1/2023-24 Dated: 09-02-2024

Sl. No.	Name of Work	Name of the Grant	Estimate Value (Rs. in Lakhs)	Bid Downloading start date	Last Date for Receipt of Bids
1	Civil, Water Supply & Electrical works - 04 Nos	General Funds	21.35	09-02-2024	15-02-2024

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender.apeprocurement.gov.in

Sd/- COMMISSIONER
TADEPALLIGUDEM MUNICIPALITY